క్లుప్తంగా...

మొక్కల పంపిణీ



పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ వందనానగేష్

మణికొండ: ప్రతి ఇంట్లో సాధ్యమైనన్ని ఎక్కువ మొక్కలను పెంచుకుని ఆరోగ్యంగా జీవించాలని మణికొండ మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ ఎల్.వందనానగేష్ అన్నారు. సోమవారం ఆమె హుడాకాలనీ, భాగ్యలక్ష్మికాలనీలలో మున్సిపాలిటీ తరఫున ఉచితంగా పూల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన ఇంటి వాతావరణంతో పాటు మున్సిపాలిటీని శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలను ఎక్కువగా పెంచుకుంటే మంచి వాతావరణం, వాయువు అందుతుందన్నారు.

డ్రగ్స్‌తో పట్టుబడిన ఇద్దరు యువకులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని ఎయిర్‌పోర్టు ఓ హోటల్ సమీపంలో ఆదివారం రాత్రి అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు యువకులను నిఘాలో ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో యువకుడు తప్పించుకుని పారిపోగా.. వారి వద్ద ఎండీఎంఏ అనే డ్రగ్స్ కొద్ది మొత్తంలో (గ్రాముల్లో) లభ్యమైంది. కాగా ముగ్గురు యువకులు కూడా బెంగళూరుకు చెందిన వారిగా గుర్తించారు. ఈ ముఠాను పట్టుకునేందుకు పోలీసులు బెంగళూరుకు వెళ్లినట్లు సమాచారం. మరోకోణంలో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

పదవీవిరమణ చేసిన ఉద్యోగికి సన్మానం



ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయం విశ్వవిద్యాలయంలో 37 ఏళ్లుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి సోమవారం పదవీవిరమణ చేసిన నారాయణను విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వెంకటరమణతో పాటు ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు.

కష్టపడి పనిచేసే వారికి ప్రాధాన్యం

రాజేంద్రనగర్: బీజేపీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన ప్రాధాన్యం ఉంటుందని రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి వేముల మల్లేష్ అన్నారు. నూతనంగా జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన ఆయనను సామ నరేందర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వచ్చే ఎన్నికల్లో అర్బన్‌లోని అన్ని నియోజకవర్గాలను కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేటికి ప్రతి ఇంటికి అందుతున్నాయన్నారు.

భారత పారా సైక్లింగ్ జట్టుకు కోచ్‌గా దత్తాత్రేయ



చార్మినార్: తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ భారత పారా సైక్లింగ్ జట్టుకు కోచ్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ మనీందర్ పాల్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో ఆగస్టు 3 నుంచి 13వ తేదీ వరకు జరిగే 13వ యూసీఐ వరల్డ్ సైక్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనున్న భారత పారా సైక్లింగ్ జట్టు సభ్యులు అర్షద్ షేక్, ప్రశాంత్, జ్యోతిలకు శిక్షణ ఇవ్వనున్నారు.

అన్నదానం

గోల్కొండ: స్నేహితులు, దాతల సహకారంతో విరామం లేకుండా 500 రోజులుగా అన్నదానం చేస్తున్నానని సంఘసేవకుడు, గోల్కొండ ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీ ర్ అన్నారు. సోమవారం ఆయన గోల్కొండ ఏరియా ఆస్పత్రితో పాటు ఇతర ప్రైవేటు ఆస్పత్రుల వద్ద పేషెంట్ల సహాయకులకు భోజన ప్యాకెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహ చరులు, విశ్రాంత ఉద్యోగులు, ఇతర దాతల సహకార ం తోనే ప్రతినిత్యం వందద మందికి భోజన ప్యాకెట్లు అందించడం జరుగుతుందని ఆయన అన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గోల్కొండ: సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శస్త్ర చికిత్సలకు కావాల్సిన నిధులను ముఖ్యమంత్రి తన సహాయ నిధి ద్వారా పేదలకు అందిస్తున్నారన్నారు. అయితే ఇవి నగదు రూపేనే కాకుండా నిమ్స్ ఆస్పత్రిలో కానీ, ఇతర ప్రభుత్వం గుర్తించిన ఆస్పత్రుల పేరిట చెక్కులు అందిస్తారన్నారు.

ముగిసిన అగ్రియూత్ సమ్మిట్-2023



అగ్రియూత్ సమ్మిట్-2023లో సర్టిఫికెట్లతో విద్యార్థులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న అగ్రి యూత్ సమ్మిట్-2023 కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ఎన్‌ఐపీహెచ్‌యం డైరెక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులలో వ్యవసాయరంగంలో అనేక అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని వాటిని వ్యవసాయ పట్టభద్రులు అందిపుచ్చుకోవాలని సూచించారు. వ్యవసాయ విద్యను అభ్యసించడం అదృష్టంగా భావించి, ఉద్యోగం ఆశించే వారు కాకుండా ఉద్యోగాలు కల్పించే వారిగా ఎదగాలన్నారు. పంటల యాజమాన్యం, సస్యరక్షణ, యంత్రీకరణ అంశాలలో వినూత్నమైన ఆలోచనలలో వ్యాపార కార్యక్రమాలు చేపట్టేందుకు ఆసక్తి చూపాలన్నారు. ప్లాంట్ హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటు చేసేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని విశ్వవిద్యాలయ అధికారులకు సూచించారు. దీని ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కలగడంతో పాటు రైతాంగానికి సేవలు అందించే వీలు ఉంటుందన్నారు. ఆధునిక సమాచార పరిజ్ఞానాన్ని వినియోగించుకుని రైతులకు 'కృత్రిమ మేధ మెషిన్ లెర్నింగ్ డ్రోన్'ల ద్వారా సేవలు అందించడంపై దృష్టి పెట్టాలన్నారు. అగ్రియూత్ సమ్మిట్ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు.



పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

రెండు విశ్వవిద్యాలయాల మధ్య ఒప్పందం..

విద్యార్థులకు గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణ ఇవ్వడానికి రెండు విశ్వవిద్యాలయాల మధ్య ఒప్పందం కుదిరింది. పీ.వీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం, మల్లారెడ్డి డీమ్డ్ విశ్వవిద్యాలయం మధ్య పరస్పర ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం మల్లారెడ్డి కళాశాలలో అగ్రికల్చర్, హర్టికల్చర్ చదువుతున్న విద్యార్థులను రూరల్ అగ్రికల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రామ్ కింద ప్రతి ఏటా 40 మంది విద్యార్థులను పీవీ నరసింహారావు యూనివర్సిటి పరిధిలోని వరంగల్ జిల్లా మమునూరు కృషి విజ్ఞానకేంద్రం పరిధిలోని దత్తత గ్రామాల్లో శిక్షణ ఇచ్చేందుకు అంగీకార పత్రాలను పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి డీమ్డ్ విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ రాజారెడ్డిలు మార్చుకున్నారు. రెండు యూనివర్సిటీల్లో ఉన్న ప్రయోగశాలలోని సదుపాయాలను సెమినార్లు, శిక్షణాతరగతులు నిర్వహించుకోవడానికి అవకాశం ఉందన్నారు. పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జ్ఞానప్రకాష్, విస్తరణ సంచాలకులు మహేందర్, డీన్ రఘునందన్, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగామ్ కో–ఆర్డినేటర్ రాజన్న, మల్లారెడ్డి యూనివర్సిటీ కో–ఆర్డినేటర్ ఆనంద్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ఘన స్వాగతం



కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

శంషాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్ పర్యటకు వెళ్తున్న సమయంలో పట్టణంలోని తొండుపల్లి వద్ద బీజేపీనేతలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. తొండుపల్లి వద్ద కాన్వాయ్ ఆపి దిగిన కిషన్‌రెడ్డిని జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ తదితరులు ఆయనకు స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు.

వరద బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం..

రాజేంద్రనగర్: వరద బాధితులను ఆదుకోవడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ కౌన్సిలర్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ పోరుబాట సందర్భంగా కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డికి పార్టీ నాయకులతో కలిసి శంషాబాద్ మండలంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం కిషన్‌రెడ్డి వెంట మహబూబ్‌నగర్ ఆర్‌బీ గెస్ట్‌హౌజ్ నుంచి క్లాక్‌టవర్ వరకు పాదయాత్రగా వెళ్లి బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వరద బాధితులను ఆదుకోవడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

బండ్లగూడ: దశలవారీగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తున్నామని కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. సోమవారం పర్యటించిన ఆయన మాట్లాడుతూ.. కాళీమందిర్ ఎదురుగా ఉన్న స్వీట్‌షాపు ముందు గత కొంతకాలంగా నీరు నిలిచి బురదగా మారి దుర్గంధం వ్యాప్తి చెందుతుందన్నారు. దీంతో విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. డ్రైనేజీలైన్‌ను కూడా త్వరలో పూర్తి చేయాలని డీఈఈ యాదయ్యకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కార్పొరేషన్ పరిధిలో రోజూ పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నామని శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రవి, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



హోమియో ప్రివెంటివ్ మాత్రల పంపిణీ



అవగాహన కల్పిస్తున్న భాగ్యనగర్ విభాగ్ సేవా ప్రముఖ్ భల్లా మల్లేష్

బండ్లగూడ: ప్రజలు సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని భాగ్యనగర్ విభాగ్ సేవా ప్రముఖ్ భల్లా మల్లేష్ వెల్లడించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత సేవా విభాగం బస్తీ సంస్కార కేంద్ర సంరక్షణ సమితి ఆధ్వర్యంలో సన్‌సిటీ ప్రాంతంలో సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు రాకుండా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హోమియో ప్రివెంటివ్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సంస్కార కేంద్ర శిక్షక్ మాతృమూర్తి జయసుధ, బస్తీ సంస్కార కేంద్ర సంరక్షణ సమితి సభ్యులు కేశవులు తదితరులున్నారు.

డిప్యూటీ కమిషనర్ పర్యటన



వరద నీటిని పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్

రాజేంద్రనగర్: ప్రజా సమస్యలను అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పరిష్కరించాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ వెల్లడించారు. సోమవారం బృందావన్‌నగర్ కాలనీలో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని గోతులమయంగా మారిన రోడ్లల్లో వర్షం నీరు నిలిచిపోయి ప్రజలకు ఇబ్బందికరంగా మారాయన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సైతం శిథిలావస్థకు చేరిందని రోడ్లకు ప్యాచ్‌వర్క్స్ ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. ఈ పర్యటనలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

రాజేంద్రనగర్: డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ నిధులను మంజూరు చేయిస్తానని మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ రహమత్‌బేగ్ వెల్లడించారు. ఆ పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్సీని కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని శివరాంపల్లి రాజేంద్రనగర్ హనుమాన్‌నగర్, గాంధీనగర్, బుద్వేల్ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్సీకి వివరించామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని నిధుల కొరత లేదని అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. మజ్లిస్ పార్టీ నేతలు హైమద్, ఇర్ఫాన్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ రహమత్‌బేగ్‌కు సమస్యలు వివరిస్తున్న మజ్లిస్ నేతలు

ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



పాల్మాకులలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరీశ్

శంషాబాద్ రూరల్: వచ్చే సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసే కేంద్రాన్ని మండలంలోని పాల్మాకుల శివారులో జిల్లా కలెక్టర్ హరీశ్ పరిశీలించారు. సోమవారం ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల భవనంలో ప్రస్తుతం సంక్షేమ విద్యాలయం కొనసాగుతుంది. గత సాధారణ ఎన్నికల్లో ఈ భవనంలోనే ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఈసారి కూడా ఇక్కడే ఏర్పాటు చేసే యోచనలో జిల్లా అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ, భద్రతపై తీసుకోవాల్సిన చర్యలపై డీసీపీ నారాయణరెడ్డి, ఇతర అధికారులతో చర్చించారు.

మట్టిని పోసి.. గుంతలు పూడ్చి



గుంతల్లో మట్టిని నింపుతున్న శంషాబాద్ ట్రాఫిక్ పోలీసులు

శంషాబాద్: పట్టణంలో దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రహదారుల్లో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గమనించిన శంషాబాద్ ట్రాఫిక్ పోలీసులు వాటిని సరిదిద్దేందుకు రంగంలోకి దిగారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజు మిగిలిన పోలీసులతో కలిసి మట్టిని లారీలను తెప్పించి రాళ్లగూడ పద్మావతిగార్డెన్ సమీపంలో భారీ గుంతలు పడిన రహదారిని మట్టితో నింపారు. ట్రాఫిక్ పోలీసులు తీసుకున్న చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వినతిపత్రం అందజేత



శంషాబాద్ ఏఎల్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఏఎల్‌ఓ ఆఫీసర్‌కు సీఐటియూ బీసీడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కురుమయ్య, రామ్మోహన్‌ల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన లేబర్ ఇన్సూరెన్స్ కార్డు, రెన్యూవల్‌కు ఫింగర్ ప్రింట్ ప్రవేశపెట్టిన విధానం కార్మికులకు శాపంగా మారిందన్నారు. ఈ బిల్డింగ్ రంగంలో పనిచేసే కార్మికులకు ఫింగర్ ప్రింట్ రావడం చాలా కష్టమని లేబర్ కమిషన్ ప్రవేశపెట్టిన ఈ కొత్త విధానాన్ని రద్దుచేసి కొత్త కార్డు, రెన్యూవల్ విధానాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. బీసీడబ్ల్యూ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి వెంకటయ్య, అధ్యక్షులు స్వామి, మొగులయ్య, పార్వతి, మన్యం, బాలు, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

మెహిదీపట్నం డీఎంగా జీవీ కృష్ణమూర్తి



గోల్కొండ: మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా జీవీ కృష్ణమూర్తి నియమితులయ్యారు. ఇప్పటి వరకు డిపో మేనేజర్‌గా విధులు నిర్వహించిన సూర్యనారాయణ బదిలీపై జహీరాబాద్ డిపోకు వెళ్లారు. కాగా పరకాల డిపో నుంచి బదిలీపై వచ్చిన జీవీ కృష్ణమూర్తి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిపోకు చెందిన సీనియర్ అధికారులు ఆయనను కలిసి అభినందించారు.

న్యాయవాదులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం

గోల్కొండ: న్యాయవాదులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. తెలంగాణ అడ్వకేట్ ఫోరం ఫర్ జస్టిస్ సభ్యులు సోమవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా యువ న్యాయవాదులు వృత్తిలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారని, పవిత్రమైన న్యాయవాద వృత్తిని నమ్ముకుని వారు ఎందరో పేదలకు న్యాయసేవలు అందిస్తున్నారని ఫోరం చైర్మన్, వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యులు వహీద్ అహ్మద్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. న్యాయవాదుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎన్నో చర్యలు చేపట్టారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. న్యాయవాదులు మీర్ వాజిద్ అలీఖాన్, వలీ ఉర్ రహమాన్ తదితరులున్నారు.

న్యాయం చేయాలని మంత్రి సబితారెడ్డికి వినతి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఎన్‌ఐఆర్‌డీ ప్రాంతంలోని తమ పొలాలను సర్వేచేసి తమకు అప్పగించేలా తగిన చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ వాసులు మంత్రి సబితాఇంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సోమవారం మంత్రి నివాసంలో కలిసి తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు. అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు పత్తిరాజు, పచ్చ శ్రీనివాసులు, మంత్రి చంద్రశేఖర్, మల్కారం రాములు, నర్సింహ్మ, రాములు, మహేష్, బాబురావు, శ్రీరాములు, జంగయ్య, మంచిరేవుల రాజు, క్రాంతి, రాధేశ్యామ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

హైదరాబాద్ జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘాల ఎన్నికలు

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘాల సమైక్య ఎన్నికల్లో అధ్యక్షులుగా కొప్పు పద్మ, ఉపాధ్యక్షులుగా బైరి వినోద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయనగర్‌కాలనీలోని రాష్ట్ర మత్స్యశాఖ కార్యాలయం వద్ద అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన పాలకవర్గం రాబోయే ఐదేళ్లల్లో మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెంచే విధంగా కృషి చేయాలని, నగరంలోని ప్రజలకు పౌష్టిక ఆహారమైన చేపలు అందుబాటులో ఉండేవిధంగా ప్రణాళికలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో నూతన డైరెక్టర్లు కర్రెల్లి లలిత, ముఠా దశరత, పూస నాగమణి, మెట్టు విజయలక్ష్మి, కట్ట లింగం, సుధారాణి, అరుణ, వరలక్ష్మి, సంఘం నాయకులు అర్వపల్లి శ్రీరాములు, గుడిపల్లి కనకతార, చంద్రి, పుష్ప, బి.బాలమణి, రాజమణి, కె.శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన వారిని అభినందిస్తున్న సభ్యులు

పెన్షన్ సాధన రథయాత్రకు భారీగా ఉద్యోగులు



హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

ఏజీవర్సిటీ: పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రకు ఉద్యోగులు భారీసంఖ్యలో తరలివచ్చారు. విశ్వవిద్యాలయాల ఉద్యోగులు, సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆదివారం రాత్రి హాజరై స్వాగతం పలికారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేసేలా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న 3.3 లక్షల మంది ఉద్యోగుల్లో రెండు లక్షల మంది పీపీఎస్ ఉద్యోగులు ఉన్నారని వీరందరూ సీపీఎస్ రద్దు కావాలని కోరుకుంటున్నారని వివరించారు. ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షా కాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గోల్కొండ: వర్షా కాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకిలోని తన కార్యాలయం బల్దియా మలేరియా విభాగం అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రెండేళ్లుగా దోమలు లేకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారని, వర్షాలు కురుస్తుండటంతో దోమలు మళ్లీ విజృంభిస్తున్నాయన్నారు. కళ్లకలక, డెంగీ వ్యాధులతో ప్రజలు అసలే రోగాలబారినపడ్డారని, దోమలతో మళ్లీ మలేరియా, టైఫాయిడ్ ప్రబలే అవకాశం ఉందని ఆయన అన్నారు. పారిశుద్ధ్య పనులు ప్రతినిత్యం జరిగేలా తాను బల్దియా కమిషనర్‌ను కలిసి కోరానన్నారు. రోడ్లపై ఓవైపు బురద, మరోవైపు చెత్త కుప్పలు, దోమలు పెరగడానికి అవకాశం కల్పిస్తున్నాయన్నారు. గోల్కొండ కోట శాతం చెరువు, కోట కందకాలు, బుల్కాపూర్ నాలా, మూసీనది పరీవాహక ప్రాంతాల్లో ప్రతినిత్యం దోమల మందును స్ప్రే చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అర్బన్ ఎంటమాలజిస్ట్ రాంబాబు, సీనియర్ ఎంటమాలజిస్ట్ కె.రజనీ తదితరులున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్